రజకులం.. జీవితం కష్టతరం



వనదుర్గాపురంలో మురికి గుడ్డలు తీసుకెళ్తున్న రజకులు

సౌకర్యాలు కరువు

ఆయా గ్రామాల్లో రజకులకు ప్రభుత్వంతోపాటు, గ్రామస్తులు ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదు. కనీసం దోబీ ఘాట్లు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం లేదు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది



చెరువులో గుడ్డలు ఉతుకుతున్న రజకులు



శ్రీకావేరిరాజుపురంలో ఇంటింటికి తిరిగి గుడ్డలు తీసుకొస్తున్న సుగుణమ్మ

- దోబీ ఘాట్లు లేక రజకుల ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని డిమాండ్
- ఇస్త్రీ పెట్టెలు, ఇతర మనిముట్లు, సబ్సిడీ రుణాల కోసం వినతులు

పాలసముద్రం: రజకుల జీవితాలు కష్టతరంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో దోబీ ఘాట్లు లేక పోవడం, నీటి సమస్య తీవ్రం కావడం వారి కుల వృత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు వెయ్యి కుటుంబాలకు పైగా కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దోబీ ఘాట్లు లేక పోవడంతో చెరువులు, వంకలు, కుంటలపై ఆధారపడాల్సి వచ్చేది. వేసవికాలంలో వంకలు, కుంటల్లో నీరు లేక పోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆయా రైతులు వీరు అడ్డుకుంటున్నారు. దీంతో రజకులు జీవితం గడపాలని సుమారు రెండు, మూడు కిలోమీటర్ల దూరం దుస్తులను వీపుపై మోసుకి తీసుకెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. చెరువు వద్దకు వెళ్లి దుస్తులను శుభ్రం చేసి దుస్తులు ఆరవేసేందుకు స్థలం లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అందని ప్రభుత్వ సాయం

గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తమకు ప్రభుత్వం నుంచి ఇస్త్రీ పెట్టెలు, ఇతర పనిముట్లు పంపిణీ చేశారని, ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని రజకులు విమర్శిస్తున్నారు. పైగా బ్యాంకు రుణాల మంజూరులోనూ జన్మభూమి కమిటీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్యాంకు రుణాలతోపాటు దోబీఘాట్లు నిర్మించాలని కోరుతున్నారు.

రజకుల సమస్యలు మా దృష్టికి రాలేదు

నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు రజకులు మా దృష్టికి తీసుకురాలేదు. రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే బీసీ కార్పొరేషన్ ద్వారా వారికి లోన్ సౌకర్యం కల్పిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బోర్లు, దోబీ ఘాట్లు ఏర్పాటుకు సహాయం అందించి, తగిన న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాం.

–సతీష్‌కుమార్, ఎంపీడీఓ

ఘాట్లు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో ఘాట్లు లేవు. దీంతో కుల వృత్తిపై ఆధారపడి జీవించే మాలాంటి వారు ఇబ్బందులు పడుతున్నాం. గ్రామాల సమీపంలో కాలువ నీటిపై ఆధారపడి కులవృత్తి కొనసాగిస్తున్నాం. ఎండాకాలంలో నీటి ప్రవాహం ఉండదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. –రఘుపతి, శ్రీకావేరిరాజుపురం

సమస్యలు పరిష్కరించాలి



వేసవిలో చాలా గ్రామాల్లో పూర్తి స్థాయిలో నీరుండదు. వర్షాకాలంలో సైతం చెరువుల కింద చిన్నచిన్న కాలువల్లో పారే నీటిలో బట్టలు ఉతకాల్సి వస్తోంది. నీరు ఉండేచోటకు రెండు కిలో మీటర్లు వెళ్లాలి. ప్రభుత్వం స్పందించి బోర్లు, దోబీ ఘాట్లు ఏర్పాటు చేసి రజకుల సమస్యలను పరిష్కరించాలి. –లక్ష్మణన్, శ్రీకావేరిరాజుపురం

పింఛన్ మంజూరు చేయాలి



ప్రతి రోజు ఇంటింటికి తిరిగి మురికి గుడ్డలను తీసుకెళ్లి ఉతికి అందులో వచ్చిన నగదుతో జీవనం చేస్తున్నాం. 50 వయస్సు అయిపోతే నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రజకుల కష్టాలను తెలుసుకుని మాకు 50 సంత్సరాలకు పింఛన్ మంజూరు చేయాలి. దీంతో వచ్చే నగదుతోనై మా జీవనం సాగుతుంది. లేకుంటే తిండికి కూడా కష్టాలే. –బాషా, శ్రీకావేరిరాజుపురం

క్లుప్తంగా

వైభవంగా పౌర్ణమి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో సోమవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అనంతరం లక్ష్మీనారాయణ మూర్తులకు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమం, కర్పూర హారతులు, నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యల వినతులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ లోకనాథపిళ్లై రెవెన్యూ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదికలో 11 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 3, దారి సమస్యలు 5, రేషన్‌కార్డుల కోసం 3 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమానికి రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్

నగరి: ఎయిడ్స్‌పై సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే ఎయిడ్స్‌ను నిర్మూలించ వచ్చని స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి అన్నారు. సోమవారం కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకొనే వ్యాధని అన్నారు. అవగాహన పెంచుకుంటే ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ హరిబాబు, ఏఎన్ఎం సుగుణ, మహిళా పోలీస్ మంజుల, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరుకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకొంటున్న అంకయ్య

పుత్తూరు: జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డును పుత్తూరు పురపాలక సంఘం కైవసం చేసుకొంది. ఈ మేరకు సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ స్వచ్ఛ ఆంధ్ర–2025 అవార్డును అందుకొన్నారు. అలాగే పుత్తూరు పురపాలక సంఘ ఉత్తమ పారిశుధ్య కార్మికుడిగా అంకయ్య ఎంపికయ్యాడు. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సీఎంసీ వైద్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని సీఎంసీ వైద్యులు అన్నారు. చిత్తూరు మండలం తుమ్మిందలోని విజ్ఞానతేజ స్కూల్‌లో సోమవారం సీఎంసీ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్‌కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 40 మంది వైద్యులు పరీక్షలు చేసి మాట్లాడారు. మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజని, నిర్వాహకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరిలో సత్యసాయి సువర్ణరథం



రథంలోని సత్యసాయికి హారతులు

నగరి: సత్యసాయి శత వర్ష జన్మదినోత్సవ వేడుకలలో భాగంగా తమిళనాడు, తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నుండి ప్రేమప్రవాహిని సువర్ణవర్ణ రథం తిరుత్తణి వెళుతూ మార్గమధ్యంలో సోమవారం నగరికి విచ్చేసింది. శ్రీసత్య సాయి భజన మండలి, నగరి కన్వీనర్ లాయర్ మురళీధర్ రథానికి పూర్ణ కుంభ స్వాగతం పలికి, హారతులిచ్చారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. రథం ప్రయాణించిన మార్గంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. సాయంత్రం మండలంలోని తడుకుపేటకు చేరుకున్న రథానికి భజన మండలి, కన్వీనర్ వెంకటరమణ, సభ్యులు, బాల వికాస్ విద్యార్థులు, సత్యసాయి సూక్తుల ఫ్లకార్డులతో రథానికి స్వాగతం పలికి హారతి ఇచ్చి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అక్కడి నుంచి రథం రాష్ట్ర సరిహద్దు తిరుత్తణికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో తిరువళ్లువ జిల్లా అధ్యక్షుడు గోపాల్, సేవాదళ్ కో–ఆర్డినేటర్ వెంకట రాజు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మధుసూదన స్వామి, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్‌లో వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను 8వ తేదీ బహిరంగ వేలం వేయనున్నట్టు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీహరి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు కాంప్లెక్సు ఎదురుగా ఉన్న తమ స్టేషన్ వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలవారు వాహనాలను ముందుగానే చూడవచ్చన్నారు.

నూతన జీఎస్టీ ప్రయోజనకరం

పుత్తూరు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నూతన జీఎస్టీ విధానం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని స్థానిక ఎస్ఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీఎస్టీ నూతన స్లాబులను గుర్తించి చెల్లింపుల్లో ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు. నూతన విధానంపై సమన్వయకర్త తిరుమలయ్య పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు దేవకి, వాసవి, శ్రీనివాసులు, నాగేశ్వర రావు, హరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

కార్వేటినగరం: జీఎస్టీ తగ్గింపు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఒక వరమని జీఎస్టీ నోడల్ అధికారి సురేష్‌బాబు అన్నారు. తగ్గిన జీఎస్టీపై సోమవారం కార్వేటినగరంలో ఈఓ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి సెల్వి, డిజిటల్ అసిస్టెంట్ రోజా పాల్గొన్నారు.



కార్వేటినగరం: జీఎస్టీపై అవగాహన

సూపర్ జీఎస్టీపై అవగాహన

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జీఎస్టీ 2.0లో తీసుకువచ్చిన సంస్కరణలను, జీఎస్టీని విభజించిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగం ఇన్‌చార్జి భాస్కర్, అధ్యాపకులు వేణుగోపాల్, రెడ్డినాయక్, గోపి పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు చేసుకోవాలి

నింద్ర: మండలంలోని రైతులు తమ పంటలు సాగు చేసిన వాటిని ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చేపట్టిన నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని కోరారు. రబీ సీజన్‌లో పంటల నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



నింద్రలో ఈ క్రాప్ నమోదు

నిరుద్యోగ భృతి హామీ ఏమైంది?



ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ నిరసన

నగరి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3 వేలు ఇవ్వాలని అఖిల భారత యువజన సమైఖ్య (ఏఐవైఎఫ్) యువజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. నగరి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగం యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ సోమవారం ఏఐవైఎఫ్ నాయకులు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీఓ అనుపమకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు ముత్తు, నేతాజీ, రాజకోటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం 17 నెలలు గడిచినా ఈ ఊసే ఎత్తలేదన్నారు. యువజన సంఘం పోరాటానికి ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలుపుతూ పాల్గొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారానికి 17 నెలలు కావస్తున్నా ఇంతవరకు నిరుద్యోగ భృతిపైన ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక వాడ కోసం భూసేకరణ చేసినా పరిశ్రమలు రావడం లేదన్నారు. పరిశ్రమలను రప్పించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ యువజన సమైక్య నాయకులు ఉదయ్‌కుమార్, రాబిన్ హుడ్, హర్షిత్, మయూర నాథ్, ఏఐటీయూసీ నాయకులు వేలన్, సుబ్రమణ్యం, శేఖర్, యేసయ్య, షిరావుద్దీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం





పుష్పాలంకరణలో స్వామివారు, బాలగురునాథీశ్వర స్వామి పూజల్లో భక్తులు

పాలసముద్రం: రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి పౌర్ణమి సందర్భంగా సోమవారం రుద్రాభిషేక పూజలు, వివిధ యాగశాల పూజలు చేశారు. ఉదయం భక్తులు యాగశాలకు కావాల్సిన పూజ సామగ్రితో మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి సామివారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ హోమం, శాంతి హోమం, యాగశాల పూజలు చేశారు. కలశ నీటితో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యిలతో అభిషేకించి, సుందరంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వన్యప్రాణుల వేట నేరం

కార్వేటినగరం: వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని అటవీశాఖ అధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ డైట్‌లో విద్యార్థులకు వైస్ ప్రిన్సిపల్ దాము ఆధ్వర్యంలో వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో జీవించే అరుదైన వన్యప్రాణులను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అటవీ జంతువులను వేటాడితే వారిపై కేసు నమోదు చేసి శిక్షిస్తామన్నారు. జనారణ్యానికి వచ్చే వన్యప్రాణులను రక్షించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం డైట్ వైస్ ప్రిన్సిపల్ దాము మాట్లాడుతూ అటవీ జంతువులను ప్రేమించి రక్షించాలన్నారు. జింకలు, నెమళ్లు, దుప్పులు తదితర జంతువులు అరుదుగా జనారణ్యంలో వస్తుంటాయని, వాటికి ఎలాంటి హాని తలపెట్టకూడదని పేర్కొన్నారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఆనందరెడ్డి, ఎఫ్ఎస్ఓ లోకేష్, బీట్ అధికారులు వినోద్, గంగులయ్య, శ్రీనివాసులు, డైట్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



డైట్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారి వెంకటసుబ్బయ్య

విగ్రహానికి నిప్పు పెట్టినవారిని శిక్షించాలి



దళిత నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

పుత్తూరు: వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య డిమాండ్ చేశారు. సోమవారం పుత్తూరు మండలం ఎగువగూళూరు దళితవాడలో అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడికి నిరసనగా అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. నందయ్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి విధ్వంసానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ మైనారిటీల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హోం మంత్రి అనిత ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని కోరారు. దళితులకు న్యాయం జరగాలని, లేనిపక్షంలో ఆందోళనలు, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు రవి, భూపాల్, కేశవులు, శివయ్య, గోపాల్, కృష్ణ, తులసి తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు స్వామికి అభిషేకం అనంతరం గంధం, తమలపాకులు, తులసి మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం

పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో ఉభయదారుల ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా సుదర్శన హోమం పూజలను నిర్వహించారు. తొలుత కలశ స్థాపన చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ప్రాకారోత్సవం

ఆలయ ఇన్‌చార్జి ఈఓ మునిశేఖర్ పర్యవేక్షణలో ఇదే రోజు రాత్రి అర్చకులు ఉత్సవమూర్తికి ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామివారు పల్లకిలో కొలువుదీరారు. అనంతరం స్వామి ఆలయం, సంజీవరాయ పుష్కరిణి చుట్టూ విహరించారు. ఈ సందర్భంగా భక్తుల కాలక్షేపం కోసం ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.